విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



జిల్లా వ్యవసాయాధికారులతో మంత్రి సమీక్ష

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాస్త్రవేత్తలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాల కొండయ్య పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ బాబు , ఇతర అధికారులు హాజరయ్యారు.

కుక్కల స్వైర విహారం

- మూడేళ్ల బాలుడు పై దాడి
- మరి కొందరికి గాయాలు

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నెల్లూరు నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా ప్రజలపై దాడులకు పాల్పడు తున్నాయి. తాజా గా నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్ గుడిపల్లిపాడులో మూడేళ్ల బాలుడు పై కుక్కలు దాడి చేసి గాయ పరిచాయి. ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయని బాలుడు తల్లిదండ్రులు తెలిపారు. బాలుని అల్లిపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీసుకెళ్లి ఏ ఆర్ వి ఇంజక్షన్లు చేయించినట్లు తెలుస్తోంది. గుడిపల్లిపాడులో మరి కొంతమంది కూడా కుక్క కాటుకు గురయ్యారని తెలుస్తుంది. నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా శునకాలు తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. నగర వ్యాప్తంగా కుక్కలు అన్ని డివిజన్లో స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలను పట్టి తరలిం చాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షక కవచంలా దిశ యాప్

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: మహిళలకు రక్షక కవచంలా పనిచేస్తున్న దిశా యాప్ 24 గంటలూ మహిళల భద్రతకు బాసటగా నిలుస్తోందని ఎస్పీ విజయరావు అన్నారు. అర్ధరాత్రి వేళ దిశ యాప్ ద్వారా సకాలంలో మహిళ ప్రాణాలను ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు కపాడారు. దిశ అప్లికేషన్‌తో ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ శాఖ చరిత్ర సృష్టిస్తోందన్నారు. దిశ అప్లికేషన్ పై రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో యాప్ డౌన్లోడ్ తో పాటు రిజిస్ట్రేషన్ కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. యాప్ డౌన్లోడ్ తో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా సకాలంలో లభించిన రక్షణ నెల్లూరు జిల్లా కావాలి సమీపంలోని తుమ్మల పెంట సముద్ర తీరం వద్ద అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న మహిళా వద్దకు చేరుకున్న గుర్తుతెలియని వ్యక్తి మాయమాటలతో మహిళను మాయచేసి సమీపంలోని రిసార్ట్స్ కి తీసుకొని వెళ్లాడు. నమ్మకంగా నటించి రిసార్ట్స్ కి తీసుకువెళ్లిన వ్యక్తి ఒక్క సారిగా మహిళా పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తనతో పాటు మరో మహిళను లైంగికంగా వేధించడంతో అందుకు నిరాకరించిన మహిళ మొక్కవోని ధైర్యంతో వారిని ఎదుర్కొన్న తీరు అభినందనీయం. ఒక వైపు ముగ్గురు వ్యక్తులు దాడి చేస్తూ, హింసిస్తున్నారని, చంపేస్తారనే భయపడుతూనే మరో వైపు తనని ఎలా కాపాడుకోవాలో అర్థం కాక ఏమి చెయ్యాలో దిక్కుతోచని స్థితిలో బాధితురాలికి అత్యంత విపత్కరపరిస్థితులో గుర్తొచ్చిన దిశా యాప్ ద్వారా తన ఫోన్ లో ఉన్న దిశ యాప్ లోని బటన్ నొక్కి పోలీసులకు మహిళ సమాచారం అందించింది. అర్ధరాత్రి 1.19 కి దిశ ద్వారా సమాచారం అందుకున్న సమీపంలోని కావలి రూరల్ పోలీసులు నిముషాల వ్యవధిలో బాధితురాలి వద్దకు చేరుకొని భరోసా కల్పించి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

పోలీసులకు కృతజ్ఞతలు

ఆపదలో ఉన్న తానను దిశ అప్లికేషన్ ద్వారా అందించిన సమాచారంతో నిమిషాల వ్యవధిలోనే తాను ఉన్న ప్రాంతానికి చేరుకొని తన ప్రాణాలను కాపాడిన కావలి రూరల్ పోలీసులకు, జిల్లా ఎస్పీకి భాదితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంతి ఉద్యోగుల సమావేశం

విశాలాంధ్ర-కోవూరు: ఏపీ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగాలు సమస్య లపై, కోవూరు లో బైనా సన్స్ కల్యాణ మండపం లో మంగళవారం జనరల్ బాడీ సమావేశం అసోసియేషన్ కోవూరు శాఖ ప్రెసిడెంట్ అప్పలసుబ్బారావు అధ్యక్ష తన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం నుండి విశ్రాంతి ఉద్యోగాలు వారికి రావలసిన పలు రాయి తీలు వెంటనే చెల్లించాలని, ప్రధానంగా ప్రతి నెల వచ్చే పింఛన్ 1వ తేదీనాడు తప్పక విడుదల చెయ్యాలని సమావేశం లో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమం లో కోవూరు విశ్రాంతి ఉద్యోగుల కమిటీ మెంబర్స్ అదిశేషయ్య, కృష్ణయ్య, నందగోపాల్, జయరామయ్య, పరబ్రహ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవంలో ఎమ్మెల్యే

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలోని మైపాడు గేటు సెంటర్ జాఫర్ సాహెబ్ కాలువ వద్ద కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన కార్తీక దీపోత్సవ లో నగర శాసన సభ్యులు డాక్టర్ పి. అనీల్ కుమార్ పాల్గొని కార్తీక దీపాన్ని వెలిగించి, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి జాఫర్ సాహెబ్ కాలువలో కార్తీక దీపాన్ని వదిలారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, కార్పొరేటర్లు పోలంరెడ్డి లక్ష్మీ ప్రత్యూష, సంక్రాంతి అశ్విని, ఓబిలి రవిచంద్ర, నవాబుపేట శివా లయం చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీజిబి సేవలను వినియోగించుకోండి : ఎంపిడివో

విశాలాంధ్ర - కావలి : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కావలి ఎంపీడీవో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలోని వైయ స్సార్ క్రాంతి వెలుగు కార్యాలయంలో బ్యాంకు ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంకు అందిస్తున్న డిపాజిట్ పథకాలను, రుణ పథకాలను, బీమా పథకాలను, ఇతర సేవలను వివరిస్తూ కళా జాతర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇతర బ్యాంకులతో పోటీ పడుతూ ఏపీజీబీ బ్యాంకు విస్తరిస్తుందని ఎంపిడివో తెలిపారు. ప్రగతి - 666, ప్రగతి - 400రోజులకు ఏపీజీబీ అధిక వడ్డీ ఇస్తున్నదని, ఇంకా గృహ నిర్మాణాలు, వాహన కొనుగోలు, విద్య, వ్యాపార ఆధారిత వాటికి బ్యాంకు విరివిగా రుణాలు అందిస్తున్నదని బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కాంతారావు బ్యాంక్ అధికారులు శేషాచలం, మానస, చంద్రకాంత్, సామాజిక కార్యకర్త మాలకొండా రెడ్డి, కళా జాతర నిర్వాహకుడు మాధవరావు పాల్గొన్నారు.

ఎఫ్‌పిఓ భవన నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు

విశాలాంధ్ర - గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులో రైతు ఉత్పత్తి దారుల సంస్థ (ఎఫ్.పి.ఓ) కు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణానికీ హార్టికల్చర్ నుంచి 11. 25లక్షలు, ఎఫ్.పి. ఓ వాటా ద్వారా రూ. 3.75లక్షలు మొత్తం కలిపి 15లక్షలు మంజూరు అయినట్లు ఏపిఎం అశోక్ బాబు, మరియు ఉద్యానశాఖ అధికారి బ్రహ్మసాయి లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణానికీ సంబంధించి చర్చించారు. కొత్తపేట వెళ్లే రోడ్డు పక్కన ఈ భవనం నిర్మించతలపెట్టినట్టు సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా ఎఫ్ పి ఓ కార్యదర్శి ఆలూరు వెంకట హనుమంతరావు మాట్లాడుతూ కలెక్షన్ కేంద్రంతో పాటు అనుబంధ కార్యకలాపాల నిర్వహణ కోసం మరొక ప్రాంతంలో రెండు ఎకరాల స్థలం రైతు ఉత్పత్తిదారుల సంస్థకు కేటాయించాలని కోరారు. ఈ మేరకు సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కలెక్షన్స్ సెంటర్ నిర్మాణం బాధ్యతలు కార్యదర్శి ఆలూరు వెంకట హనుమంతరావుకు అప్పగిస్తూ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. త్వరలో కలెక్షన్స్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు కార్యదర్శి హనుమంతరావు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిసి ఇందిర, అధ్యక్షుడు చాపల వెంకట్, ఉపాధ్యక్షుడు రామ చంద్రారెడ్డి, కోశాధికారి మాల్యాద్రి రెడ్డి, రామరాజు, విజయ, చంద్రిక, లాజరు, చెంచారావు, వెంకటేశ్వర్లు, అకౌంటెంట్ రాజేశ్వరి, ఎఫ్.ఎం ఏడుకొండలు, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు .

ఘంటసాల శతజయంతి వేడుకలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఘంటసాల శతజయంతి వేడుకలను విజయవంతం చేయా లని ఘంటసాల కళానికేతన్ అధ్యక్షులు కోడూరు ఆనందరావు అన్నారు. మంగళవారం చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4వ తేదీ ఆదివారం 9 గంటల నుండి కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగే ఘంటసాల శత జయంతి వేడు కల్లో సంగీత నృత్య కార్యక్రమాలు జరుగు తాయన్నారు. ఈ సందర్భంగా కళాకారులను గాయకులను ఘనంగా సత్కరిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రాజకీయ నాయ కులు అధికారులు పాల్గొంటా రన్నారు. ఈ సందర్భంగా ఘంటసాల శత జయంతికి సంబంధించిన బ్రోచరును విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత ఎస్వీ రమేష్ ప్రముఖ విద్వాంసుడు జొన్నవాడ చెంచురామయ్య పాల్గొన్నారు.

బోధనా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-బుచ్చిరెడ్డిపాలెం: విద్యార్థులకు 3,4,5 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు బోధనా సామగ్రి పంపిణీ చేసినట్లు సోమవారం మండల విద్యాశాఖ అధికారి ఎం. దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్ కష్ట కాలంలో విద్యా ప్రమాణాలు కోల్పోయిన విద్యార్థులకు "టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్" కార్యక్రమం కింద ఏపీ ఎస్ సి ఇ ఆర్ టి, ప్రథమ్ ఫౌండేషన్ సం యుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. తెలుగు,గణితం సులభతరంగా బోధించడానికి ఈ టీచింగ్ మెటీరియల్ చక్కగా ఉపయో గపడుతుందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం మార్చి వరకు కొనసా గుతుందని విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి సదవకాశంగా దీన్ని తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఏమైనా సందేహాలు ఉంటే రిసోర్స్ పర్సన్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గండికోట సుధీర్ కుమార్, సురేంద్ర, సి.ఆర్. పి.లు శీనయ్య, మల్లీశ్వర్ రెడ్డి,మహేష్, మస్తానయ్య పాల్గొన్నారు.

డివిజన్‌లలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24 డివిజన్, జాషువా నగర్, సుందరయ్య కాలనీలలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పర్యటించారు. ఈ ప్రాంతాల్లో పనులను వీలైనంత త్వరగా నాణ్యత ప్రమాణాలతో నిర్దిష్ట కాలంలో పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను కోరారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, నెల్లూరు రూరల్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ప్రజలందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ అరవ శాంతి, డివిజన్ అధ్యక్షుడు అరవ శీను, స్థానిక వైసీపీ నాయకులు అన్నపురెడ్డి శేఖర్, మాలాద్రి పాల్గొన్నారు.

గవర్నమెంట్ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు సజ్జల రామకృష్ణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన పేర్నాటి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ఈరోజు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణ రెడ్డి ని ఆయన కార్యాలయంలో గవర్నమెంట్ కాంట్రాక్ట్ లెక్చరర్లతో కలిసి దీర్ఘకాలంగా పెండిగులో ఉన్న సమస్యలను పరిష్కరించాల్సిందిగా వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కోరారు. గవర్నమెంట్ కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పీఆర్సీ ప్రకారం మాకు జీతాలు ఇచ్చినందుకు ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవా దాలు అని, గత 20 సంవత్సరాలుగా ఒప్పంద ఉపాధ్యాయులుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న తమకు సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు. సజ్జల రామకృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధ్యాపకుల విషయంలో చాలా సానుకూల దృక్పథంతో ఉన్నారని, త్వరలో మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- నెల్లూరు: కలువా యి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చల్లా రఘు రామిరెడ్డి సతీమణి కలువాయి గ్రామ మాజీ సర్పంచ్ చల్లా ఇందిర జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రఘురామి రెడ్డి యువత ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రఘురామిరెడ్డి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సిఐటియు మహాసభ

విశాలాంధ్ర - కావలి : పట్టణ సిఐటియు 4వ మహాసభ స్థానిక సిఐటీయు కార్యాలయంలో టి.సుబ్బారామ శర్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ మహాసభ లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. అజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగంలో ఉన్న పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలను వీధులపాలు చేస్తున్నదని, కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. పని భద్రత లేకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి కార్మికుల ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందని ప్రజలు కార్మికులు ఉద్యోగులు పెరిగిన ధరలతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల నుండి కేంద్ర ప్రభుత్వం ఖజానా నింపుకుంటుందని, కార్మికులకు, ఆశ, అంగన్వాడి, మున్సిపల్ కార్మికులకు పని భారాన్ని పెంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా వారి కష్టాన్ని దోచుకుంటున్నారని, కనీస వేతనాలు అమలు చేయాలని, అన్ని రంగాల కార్మికులు పోరాడితే ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి మన జిల్లాలో ఉన్న దామోదర సంజీవయ్య విద్యుత్ ప్లాంటును ఆదానికి అప్పజెప్పాలని చూస్తుందని, కేంద్ర ప్రభుత్వ కనుసున్నల్లో పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. స్కూల్స్ స్వీపర్ల కార్మికులకు మరీ చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, దీనివలన వారి కుటుంబాలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక ఉద్యోగ వ్యతిరేక పరిపాలనకు వ్యతిరేకంగా అన్ని రంగాల ప్రజలు కార్మికులు ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలు కొనసాగించి పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించు కోవాలలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కే రెహనా బేగం మాట్లాడుతూ డిసెంబర్ నెల 11 ,12 తేదీలలో ఆత్మకూరు పట్టణంలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి. పెంచలయ్య, ఎస్. వెంకయ్య, కే. జాన్, డివైఎఫ్ఐ నాయకులు పెంచల నరసింహం, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కావలి పట్టణ అధ్యక్షులుగా ఏవి కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వి.వసుంధర దేవి, విజయలత, ప్రధాన కార్యదర్శిగా ఎర్రంశెట్టి కృష్ణమోహన్, సహాయ కార్యదర్శిగా పెంచల నరసింహం, ట్రెజరర్ గా పోలయ్య, మరో 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

లీడర్షిప్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంపిక

విశాలాంధ్ర-సీతారాంపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అహ్మదాబాద్ వారు నిర్వహించిన లీడర్షిప్ స్కిల్ ఆన్లైన్ ఎక్సమ్ లో సీతారాంపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ యస్ యం రహమాన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఇండియన్ ఇన్స్టూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సంస్థ లీడర్షిప్ స్కిల్స్ పై ఆన్లైన్ ఎక్సమ్ నిర్వహించారని దానిలో మన రాష్ట్రం నుంచి 50 మంది ప్రధానోపాధ్యాయులు జిల్లా నుంచి ఐదుగురు ప్రధానోపాధ్యా యులు ఎంపికయ్యామని తెలిపారు .ఎంపికైన వారికి గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ వారు లీడర్షిప్ స్కిల్ పై శిక్షణ ఇస్తారని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందరం తమ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు లీడర్షిప్ వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తామని అంతేకాకుండా జిల్లాలోని పలు పాఠశాలల్లో లీడర్షిప్ స్కిల్ గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరిస్తామని తెలిపారు.



చెప్పారంటే చేస్తారంతే..

- వైసీపీ రాష్ట్ర నేత కడివేటి

విశాలాంధ్ర- మనుబో లు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పా రంటే ఏ పని అయిన చేసే తీరుతారని వైసిపి రాష్ట్ర నాయకులు కడివేటి చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. మనుబోలు సచివాలయం-2లో ఆయన మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మనుబోలు లో గడపగడపకు కార్యాక్రమం లో ప్రజల నుంచి ఎక్కువ సమస్యలు రేషన్ కార్డులపై రావడంతో మంత్రి స్పందించారు. రేషన్ కార్డు సమస్య వలనే పింఛన్ రావడంలేదని ఆయన గుర్తించారన్నారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు డీఎస్ఓ సూచనలతో రేషన్ కార్డుల సమస్యను పరిష్కరించాలని జిల్లా సివిల్ సప్లై అధికారులను ఆయన ఆదేశించారు. డి ఎస్ ఓ నెల్లూరు నుంచి ఓ అధికారి ని మనుబోలుకు పంపారు.సమస్యలు తీర్చడం లో ఇంటి పెద్ద బిడ్డలా కాకాణి వ్యవహరిస్తారని అలాంటి నాయకుడు తమకు మంత్రి గా రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన కు రుణపడి వుంటామన్నారు.ఈ కార్యక్రమం లో డి.టి లక్ష్మినారాయణరెడ్డి వీఆర్వో నాగార్జున్ రెడ్డి,వి ఆర్ ఏ శంకర్ మీడియా కో- ఆర్డినేటర్ గుంజిరమేష్ వున్నారు.

గిరిజన భూములు అప్పగించండి: బీజేపీ

విశాలాంధ్ర- కోవూరు: ఇనమడుగు పంచాయతీ లో గల సర్వే నెంబర్ 138లో చెందిన గిరిజన పట్టభూములు పెద్దల చేతిలో ఇరుక్కు పోయిందని, దీన్ని గిరిజన పట్టా దారులకు ఇవ్వాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోవూరు తహశీల్దార్ పద్మజకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె విచారణ జరిపి న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో నెల్లూరు పార్లమెంట్ బీజేపీ జిల్లా అధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు, కోవూరు అధ్యక్షులు రఘు రామయ్య, జమ్మి పాలెం బాధితులు పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్‌ని కలిసిన పేర్నాటి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి మంగళవారం కలిశారు. రాబోయే తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీటీడీ ఉద్యోగులకు సంబంధించిన పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.

గుర్తు తెలియని వాహనంఢీ -యాచకురాలు మృతి

విశాలాంధ్ర - కావలి : ఏడు సంవత్స రాల కిందట రైలు యాక్సి డెంట్ లో రెండు కాళు కోల్పోయి వీల్ చైర్ లో భిక్షాటన చేసుకుంటూ ఉన్న కావలి మండలం అడవి రాజుపాలెం కు చెందిన మార్తూరు సుశీల (50) ను మద్దూరుపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందింది. సుశీల కుమార్తె శ్రీదేవి తన భర్తతో కలిసి హైదరాబాదులో బేల్దారి పనికి పోయి ఉన్నట్లు, సుశీల భర్త మతిస్థిమితం లేక ఇంటి నుండి వెళ్లి పోయి ఉండటంతో సుశీల మద్దూరుపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీదేవి అత్త పైడాల నాగేశ్వ రి ఇచ్చిన పిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్సై జి.వీరేంద్రబాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్రంథాలయాలు భవిష్యత్తుకు దిక్సూచిలు

విశాలాంధ్ర-కందుకూరు: గ్రంథాలయాలు భవిష్యత్తుకు మార్గ దిక్సూచి లు అని జాతీయ బిసి సంక్షేమ సంఘం కందుకూరు నియోజక వర్గ అధ్యక్షుడు కుంచాల వెంకటేశ్వర్లు అన్నారు. గ్రందాలయ వారోత్సవాల ముగింపు సందర్భ%శీ%గా ఆయన కార్యలయం లో గ్రంధా లయాలు సాంకేతిక ప్రబా వం అనే అంశం పై విద్యార్థులకు చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రందాలయాలు బంగారు భవిష్యత్తు నిర్మాణానికి అవసరమైన క్రమ శిక్షణను ప్రణాళికను నేర్పుతాయని ఒంటరి తనాన్ని దూరం చేస్తాయని అన్నారు. దురదృష్టవశాత్తు నేటి విద్యార్థులకు, యువతకు గ్రంథపఠనం ఆసక్తి తగ్గుతోందని ఇది మంచి పరిణామం కాదన్నారు. పుస్తకాన్ని మించిన మిత్రుడు సృష్టి లోనే లేడని ఆయన విద్యార్థులకు సూచించారు.

పశు వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు

విశాలాంధ్ర-కందుకూరు: కందుకూరు డివిజనల్ కార్యాలయంలో కందుకూరు మండలం పశు వైద్య సిబ్బందికి ఆడ దూడలు పుట్టే కార్యక్రమం మీద ట్రైనింగ్ నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు పుట్టే కార్యక్రమం ప్రారంభించారు. రెండు కృత్రిమ గర్భధారణ వీర్య నాళికలు ఖరీదు రూ 1350 ప్రభుత్వ సబ్సిడీ రూ 850 రైతు చెల్లించవలసినది రూ 500 ఒకవేళ కృత్రిమ గర్భ ధారణ వలన గర్భం దల్చకపోతే రైతు కట్టిన రూ 500 తిరిగి ఇవ్వటం జరుగుతుంది. ప్రస్తుత కృత్రిమ గర్భ ధారణ పద్దతిలో ఉపయోగించు వీర్య నాళికలు వలన సగం మగ దూడలు సగం ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంది. కానీ లింగ నిర్ధారణ వీర్యం వాడటం వలన 90%పైగా ఆడ దూడలు పుట్టి రైతులకు పశు పోషణ మరింత లాభసాటిగా మారుతుంది ఒంగోలు (డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ) కార్య నిర్వహణ అధికారి డాక్టర్ షేక్ కాలేషా, కందుకూరు ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ ఈ సందర్భంగా పశు వైద్యులకు, కందుకూరు మండలంలో రైతు భరోసా కేంద్రం లో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో కందుకూరు పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్ మాచవరం పశు వైద్యులు డాక్టర్ ఇ.చెన్నకేశవులు, కోవూరు పశు వైద్యులు డాక్టర్ యస్. సుధాకర్, పాలూరు గ్రామీణ పశు వైద్య శాల జెఇఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

రాష్ట్ర ఎస్.సి కమీషన్ సభ్యులు కె. బసవ రావు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ఎస్.సి., దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నవరత్నాల కార్యక్రమం ద్వారా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్.సి కమీషన్ సభ్యులు కె. బసవ రావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం కావలి పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్.సి. కమీషన్ సభ్యులు బసవ రావు మాట్లాడుతూ, కొండాపురం మండలం, మర్రిగుంట గ్రామంలో ఎస్.సి కులానికి చెందిన ఇండ్ల చిన అంకయ్య కు సంబంధించిన భూ సమస్య పై రావడం జరిగిందని అన్నారు. దళితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు బసవ రావు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి అమలు చేస్తున్నదన్నారు. దళితులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచు కోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్.సి ల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత హోం శాఖ మంత్రిగా దళిత మహిళను నియమించడం జరిగిందన్నారు. దళితులకు చెందాల్సిన పథకాలు అందేలా అధికారులు పనిచేయాలని కమీషన్ సభ్యులు అన్నారు.

కాలువ నిర్మాణం లేక పోవడంతో నీట మునుగుతున్నాం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్విరామంగా, నిరాటంకంగా జరుగుతున్న పవనన్న ప్రజాబాట కార్యక్రమం 190వ రోజున 42వ డివిజన్ కోటమిట్ట కాలువ వీధి ప్రాంతంలో జరిగింది. ఇక్కడ ప్రతి ఇంటికి తిరిగిన కేతంరెడ్డి ప్రజల సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారం దిశగా పోరాడుతామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్ రెడ్డి వద్ద ఈ ప్రాంతంలో కాలువ వెంబడి ఇళ్ళ నిర్మాణాలు కల్గిన ప్రజలు తమ ఆవేదన చెప్పుకుని వాపోయారు. ఇక్కడ నూతన కాలువ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, కానీ నేటికీ నిర్మాణ పనులు చేపట్టకపోవడం వల్ల మరియు పాత కాలువని పూడికతీత తీయించకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికి కూడా తమ ఇళ్ళు నీట మునిగి బయటకు కదలలేక నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ కి, స్థానిక వైసీపీ నాయకులకు తమ బాధని ఎన్నిసార్లు చెప్పుకున్నా పరిష్కారం లభించట్లేదని అన్నారు. వారి సమస్యను సావధానంగా విన్న కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఈ సమస్యని సంబంధిత అధికారుల దృష్టికి స్థానిక జనసేన నాయకులు తీసుకెళ్తారని, వారు పరిష్కరించని పక్షంలో నెల్లూరు సిటీ నియోజకవర్గంలో రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలవబోయేది తామేనని, దగ్గరుండి ఈ సమస్యని పరిష్కరిస్తానని వారికి భరోసా కల్పించారు.

ఇంజనీర్లు ఇన్నో వేటర్లు ఎదగాలి: సిఇఓ

విశాలాంధ్ర-కందుకూరు: ఇంజనీరింగ్ విద్యార్థి డిగ్రీ పొందేసరికి ఇన్నోవేటర్ గా పరిణితి చెందాలని విశిష్ట ఇన్నోవేషన్ సీఈవో సాందీప్ అభిలాషించారు. రోబో అప్లికేషన్స్ వర్క్ షాప్ లో నైపుణ్యం ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకర బహుమతులను సంస్థ తరఫున ప్రకటించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులను,ప్రశంసా పత్రాలను కరస్పాండెంట్ రామయ్య టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే. విజయ్ శ్రీనివాసులు అందజేశారు. సాందీప్ ప్రసంగిస్తూ సాఫ్ట వేర్ రంగం కన్నా భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచి విద్యార్థులకు కోర్ రంగంలో జాబ్స్ బాగుంటాయన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకు సాగితే ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట లేనన్నారు. కోర్ రంగం ఒడిదుడుకులు లేని ఉద్యోగాలకు నేలవని సాందీప్ పేర్కొన్నారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ తమ విద్యార్థులు ఇతరుల కన్నా ఒక మెట్టు పైన ఉండాలన్న సంకల్పంతో కాలేజీ ప్రణాళికలు రూపొందిస్తుదని చెప్పారు. విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరిమితమైన కోడింగ్, ఎలక్ట్రికల్ టెక్ హబ్ తదితర క్లబ్ లను ఏర్పాటుచేసి విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని రామయ్య వెల్లడించారు. ప్రకాశం టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె.విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ వర్క్ షాప్ ల శిక్షణ తర్వాత ఆయా కిట్ లను మూలన పడవేయకుండా నిరంతరం సాధన చేస్తే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ఉద్బోదించారు. 2-3 సంవత్స రాల ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు పలువురు సమావేశంలో మాట్లాడుతూ సబ్జెక్టులకే పరిమితమైన తమకు విశిష్ట ఇన్నోవేషన్ సీఈఓ శిక్షకులు సాంకే తికంగా బలోపేతం కావడానికి ఇచ్చిన శిక్షణ జీవితంలో మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సెమిస్టర్ కు ఒక వర్క్ షాప్ నిర్వహించేందుకు యాజమాన్యం దృష్టి పెట్టాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రవికుమార్, డాక్టర్ రాకేష్, వి.కోటేశ్వర రావు,శ్రీకాంత్,మస్తాన్ వలీలు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

నుడా నిధులతో అభివృద్ధి వేగవంతం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర- విడవలూరు: విడవలూరు మండలం చౌక చర్ల గ్రామంలో, రెండవ రోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడుతూ నుడా నిధులలో రూ.50 లక్షలు మంజూరు చేశారని దీనిలో ఎస్టీ కాలనీకి రూ.25 లక్షలు, ఎస్సీ కాలనీ కి రూ.25 లక్షలు కేటాయిం చామన్నారు. ప్రభుత్వం అమలు పరు స్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గత మూడు సంవత్సరాలలో ఒక్కొక్క కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో తెలుసు కుంటున్నామన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతం అమలు పరిచిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. టిడిపి ప్రభుత్వంలో పెన్షన్ లను 40 లక్షల మందికి మాత్రమే ఇచ్చే వారని, తమ ప్రభుత్వంలో అదే పెన్షన్లను 62 లక్షల మందికి అందిస్తున్నామని తెలిపారు. సీఎం ప్రవేశపెట్టిన 32 పథకాలలో గోరుముద్ద ప్రత్యేక మైందన్నారు. ఈ పథకం ఉద్దేశం పసి బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందించాలని మెనూలో ఇచ్చి అమలు పరిచారన్నారు ఇటీవల వేగూరు హై స్కూల్ ను సందర్శించగా, పిల్లలకు ఇవ్వాల్సిన కోడిగుడ్లు తక్కువగా ఉన్నందున దానికి బాధ్యులైన వారిని తొలగించామన్నారు. ఈ విషయాన్ని ప్రత్యేకంగా మీడియా ద్వారా తెలుపుతున్నానన్నారు. ప్రతి స్కూల్ మీద మానిటరింగ్ ఉంచాలని కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతి పక్షాలైన చంద్రబాబు, దత్త పుత్రుడైన పవన్ కళ్యాణ్, విమర్శలు చేస్తున్నారని, ఎన్ని విమర్శలు చేసినప్పటికీ జగన్మోహన్ రెడ్డిని ఏమీ పీకలేరని, ఈ సంక్షేమ పథకాలు అందరికీ అందించేందుకు లక్ష 75 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎపి చైర్మన్ నిరంజన్ బాబు రెడ్డి, మండల కన్వీనర్ బెదవాడ గోవర్ధన్ రెడ్డి, సిఐ కోటేశ్వరరావు, తహశీల్దార్ కె.చంద్రశేఖర్, ఎంపీడీవో సుబ్రమణ్యం, ఎస్ఐ భాస్కర్ బాబు, గౌరవ అధ్యక్షులు నవీన్ రెడ్డి, జడ్పిటిసి లక్ష్మయ్య, ఎంపీపీ భావనమ్మ, సర్పంచ్ వినోద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా అభిషేక పూజలు

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు గ్రామంలోని చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో వెలసి ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆలయ ఆవరణలో గల శ్రీ విశ్వనాథ స్వామి వారికి కార్తీక మాసం నాలుగవ సోమవారం పర్వ దినం పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ అందంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయ దాతలుగా పిడూరు గ్రామం మాజీ సర్పంచ్ వైసీపీ నాయకులు మన్నెమాల సాయిమోహన్ రెడ్డి వీరి కుటుంబ సభ్యులు వ్యవ హరించారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నాడు నేడు పనులు తనిఖీ

విశాలాంధ్ర- సీతారాంపురం: సీతారామపురం మండలం లో మన బడి నాడు- నేడు రెండో విడతలో భాగంగా నిర్మాణ పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీఈడబ్ల్యుఐడీసీ ఏఈ శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం బసినేని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న మన బడి నాడు నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు.మండలం లోని ప్రభుత్వ పాఠశాలలకు నాడు - నేడు ద్వారా మంజూరయిన తరగతి గదులను త్వరతగిన పూర్తిచేయాలని తెలియ జేసారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఏడుకొండలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

పశుసంవర్ధక పాల్ టెక్నికల్ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపులు

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలంలోని బోజ్జన పల్లి సచివాలయం పరిధిలోని శ్రీ వేంకటేశ్వర వేటర్నరి యూనివర్సిటీ అనుసంధాన మైన పశుసంవర్ధక పాలిటెక్నికల్ కళాశాల లోని విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు చివరి రోజు నిర్వహి స్తున్నామని ప్రిన్స్‌పాల్ డాబీదందోలు ఇందిర తెలిపా రు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిర మాట్లాడుతూ పశుసంవర్ధక పాల్ టెక్నికల్ కళాశాలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆఖరి సెమి స్టర్ ఇంటర్న్‌షిప్ లో భాగంగా వీరికి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపులను ఈనెల 15 నుండి 21 తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో గ్రామాల్లో క్యాంపు లు నిర్వహించారు. సోమవారం వరకు మొత్తం 1700 పశువులకు చికిత్సనిర్వహించారు. అందు లో 15,00 ల పశువులకు వ్యా క్సిన్ లు, నులిపురుగుల మందు లు ఇచ్చారు. 200 పశువుల కు సర్జరీ,మెడిసిన్ కేసులకు చికిత్స అందించారు. చివరి రోజైన సోమవారం వేటన్నరి పాలిటెక్నికల్ కళాశాల లో వివిధ పశువు ల సంబందించిన చికిత్సలకు సంబంధించి వాడే మందులు గురించి అవగాహన కల్పించేందుకు వెటన్నరి మందుల వివిధ కంపెనీ వాళ్లను పిలిపించి అవగాహన కల్పించారు. వెటర్నరి ఫార్మసీ వారు విద్యార్థుల కు ధర్మా మీటర్లను పంపిణీ చే శారు. ఈ కార్యక్రమములో డాక్ట ర్ శ్రీహరి, డాక్టర్ సుప్రజ, ఎల్. జ యప్రసాద్, రమణయ్య, రవీం ద్రా, విశాలి, చంద్రశేఖర్, శివ, గురవయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మహావిష్ణువు, అయ్యప్ప దేవాలయంలో నిత్యాన్నదానం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు లోని మహా విష్ణువు, అయ్య ప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు అన్నదానాలు, అక్టోబర్ 26 వ తేది నుండి డిసెంబర్ 5 వరకు మాలధరించి దీక్ష భూనిన స్వాములకు జరు గుతున్న నిత్యాన్నదాన కార్య క్రమంలో భాగంగా 28వరోజు మంగళవారం రాపూరు మండల వ్యవసా య మార్కె టింగ్ వైస్ చైర్మన్ రాపూరు స్థానికులు గంగి శేట్టి వేంకటేశ్వర్లు అన్నదానం నిర్వహించారు. మంగళవారం రాత్రి స్వాములకు బిక్ష దగ్గుబాటి వెం కటేశ్వర్లు-రేణుక కుటుంబసభ్యులు నిర్వహించారు. కార్తికమాసం సందర్భంగా మహావిష్ణు వు పాదాల చెంత ఆలయ ప్రధా న అర్చకులు హర్ష వర్ధన శర్మ కార్తీక మాసంలో గోత్ర నా మాలు, ప్రత్యేక పూజలు సాయం త్రం మంత్రోచ్చారణ లతో ఆకాశ దీపారాధన ఆలయ ప్రధాన అర్చకులు హర్షవర్ధన్ శర్మ మంత్రో చ్చారణలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పంట రుణాల అర్హుల జాబితా విడుదల

విశాలాంధ్ర- రాపూరు: 2020-21 సంవత్స రం రబీ సీజన్ కు సం బంధించి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలకు అర్హత సాధిం చిన రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాలలో విడుదల చేశారు. రాపూరు మండలంలోని బ్యాంకుల్లో లక్షరూపాయలు లోపు పంట రుణాలు తీసుకోని సకాలంలో కట్టిన 119 మంది రైతులు ఖాతాల్లో సున్నా వడ్డీ నగదు ఒందులక్షలో నాల్గు వేలతొమ్మిది వందల ఇరవై రెండు రూపాయలు త్వరలో రైతులు ఖాతాల్లో జమ చేస్తారని, సకాలం లో బ్యాంకు రుణాలు చెల్లించి సున్నావడ్డీ జాబితా లో పేర్లు లేని రైతులు రైతు భరో సా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బం ది తో సంప్రదిస్తే పరిశీలించి సరి చేస్తారని రాపూరు మండల వ్యవసాయశాఖ అధికారి సోమసుం దరం తెలిపారు.

ఎంపీడీఓ ప్రాంగణ అద్దె రూముల వేలంపాట వాయిదా

విశాలాంధ్ర - గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరు ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యాపార సముదాయం నందలి రూములు అద్దెకు ఇచ్చుటకు గానూ గతంలో ప్రకటించిన తేదీని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గల అద్దె రూములకు సంబంధించి వేలంపాటను ఈ నెల 24వ తేదీ నిర్వహించేందుకు గతంలో ఎంపీడీఓ కార్యాలయం తెలిపింది. ఈ తేదీ నిర్వహణకు అనివార్య కారణాలు అడ్డంకిగా మారాయని, ఈ వేలంపాటను మరొక తేదీలో నిర్వహించ తలపెట్టినట్టు మరో ప్రకటన ద్వారా ఈ తేదీని తెలుపుతామని ఎంపీడీఓ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వలక్ష్యమని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం లింగసముద్రం మండలంలోని లింగసముద్రం సచివాలయం 1పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి యం ఎల్ ఏ హాజరై ప్రతి గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు పీయం కిసాన్, జగనన్న విద్యాదీవెన మాకు అందలేదని యంఎల్ ఏ దృష్టికి తీసుకొని వచ్చారు. కొంతమంది సైడుకాలువలు కావాలని ఇళ్ల స్థలాలు ఇప్పించాలని యంఎల్ ఏ దృష్టికి తీసుకొని వచ్చారు స్పందించిన యంఎల్ ఏ సంబంధిత అధికారులను పిలిపించి గుర్తించిన సమస్యలను పరిష్కరించాలనిఅన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకిచ్చిన హామీలనువందకు వందశాతం అమలు చేసి దేశంలో కొత్తవరవడిని సృష్టించారని తెలిపారు.కులమతాలకు, రాజకీ యాల కతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమపథకాలను అందించాలని అన్నారు ప్రజల సమస్యలను పరిష్కరించి సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం గా పనిచేయాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు చూచించారు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ గ్రామాలనుంచి రెవిన్యూ సమస్యలపై వచ్చిన వారినుంచి అర్జీలను



స్వీకరించారు. అర్జీలను పరిశీలించి వారికి న్యాయం చేయాలని తహసీల్దార్ సుధాకర్ కు చూచించారు. అనంతరం మండల వైయస్సార్ క్రాంతి పథకం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా రెండవ విడత సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ. ఆవుల.వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ చంద్రశేన్, ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య, జడ్పిటీసీ నళినిపద్మ, ఏపీఓ అబ్దుల్లా, మండలకన్వీనర్ తిరుపతి రెడ్డి, మండలమీడియా అధికార ప్రతినిది వరికూటి కృష్ణారెడ్డి, సర్పంచ్ పులి రాఘవులు, ఇంటూరి హరిబాబు, చీమల శ్రీనివాసులు, నాయకులు వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జెన్‌కోను ప్రైవేటీకరించొద్దు..

- కార్మికులను పర్మినెంటు చేయాలి
- రాజకీయ పార్టీల జేఏసీ, కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర- ముత్తుకూరు: నేలటూరు వద్ద ఉన్న ఏపీ జెన్‌కో శ్రీ దామోదరం సంజీవయ్య సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నష్టాల పేరుతో ప్రైవేటీకరించవద్దంటూ, అందులో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలంటూ రాజకీయ పార్టీల జేఏసీ, కార్మిక జేఏసీ చేస్తున్న ఆందోళన మంగళవారానికి 310 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ శ్రీ దామోదరం సంజీవయ్య సూపర్ క్రిటికల్ 2400 మెగా పట్ల థర్మల్ విద్యుత్ కేంద్రంలోపూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడమే కాకుండా, మిగులు విద్యుత్‌ను పక్క రాష్ట్రాలకు అమ్ముకోవడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. నష్టాల పేరుతో ప్రాజెక్టును ప్రైవేటీకరణ చేయడం వల్ల పూర్తి స్థాయిలో ప్రాజెక్టు దెబ్బతినే ప్రమాదం ఉందని భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు తిరిగి కోలుకోలేదని అందువల్ల కార్మికులు పూర్తిస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 163 పేరుతో ముఖ్యమంత్రి తన సొంత జిల్లా వాసులను 39 మందిని ఆర్టిపిపి, వీటిపిఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో నియమించడం విచార కరమన్నారు. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన వారిని, ఏళ్ల తరబడి ఆకలితోనో, ఆశతోనో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులైజేషన్ చేయకుండా కడపకు చెందిన వారిని చేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం టెండర్ల ప్రక్రియను మానుకొని ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని, ప్రభుత్వం ప్రాజెక్టును ప్రైవేటుకరించేందుకు ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అనంతరం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో దుర్మార్గపు పాలన ఎక్కువగా ఉందని అందువల్ల అనేకమంది బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల మధ్య చిచ్చు పెట్టేందుకే కడపకు చెందిన వారిని ఈ ప్రాజెక్టులో పని చేస్తున్న 1100 మంది కార్మికులను రెగ్యులర్ చేయకుండా ప్రాజెక్టును ప్రైవేటీకరించడం విచారించదగ్గ విషయ మన్నారు. దళిత ముఖ్యమంత్రి అయిన దామోదరం సంజీవయ్య పేరు మీద ఉన్న ఈ ప్రాజెక్టు ను అదాని కి అప్పగించేందుకు ముఖ్యమంత్రి ఉవ్విళ్లూ రుతు న్నాడన్నారు. కాంట్రాక్టు కార్మికుడు రవి ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగిని బెదిరించాడన్న నెపంతో అతనిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టిన అధికారులు నేటికీ అతనికి ప్రాజెక్టులో రెండు నెలలుగా తిరిగి ఉద్యోగం ఇవ్వకుండా పక్కన పెట్టడం విచారకరమన్నారు. ప్రాజెక్టులో కోట్ల రూపాయలు బొగ్గు అవినీతి జరిగిందని అలాంటప్పుడు అధికారులపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు ఒక కింది స్థాయి ఉద్యోగి పట్ల నిరంకుశంగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్ రావు మాట్లాడుతూ 310 రోజుల నుండి కార్మికులు ప్రాజెక్టు ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు మున్నా, సిరాజ్, సీపీఐ సర్వేపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొమారి నందయ్య, మండల కార్యదర్శి తుంగ ఏడుకొండలు, వెంకట రమణయ్య, కాకి వెంకట శేషయ్య , టిడిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి, సురేష్ రెడ్డి, ముని రెడ్డి, కాంతారావు, సీపీఎం నాయకులు, శ్రీనివాసులు, అంకయ్య, కార్మిక జేఏసీ ఆదిశేషయ్య, నక్క మోహన్ రావు, కల్తూరి రవి, అనిల్ , భాస్కర్, ఎం. రవి, కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం

- పాటించని మెనూ
- పలు పాఠశాలలో కానరాని కార్యకర్తలు

విశాలాంధ్ర - ఉలవపాడు: మండల పరిధిలోని ఉలవపాడు ,కరేడు,వేరేపల్లి మూడు సెక్టార్ ల లో ఎక్కువ శాతం పాఠశాల లో అంగన్వాడీ ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా బాలింతలు, గర్భిణులు, అంగన్వాడీల లో భోజనం చేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. దానికి పలు కారణాలు లేకపోలేదు. కొన్ని కేంద్రాల లో మెనూ పాటించక పోవడం ప్రధాన సమస్య. అయితే వండడం లో పరిశుభ్రత పాటించడం లేదనే వాదన లేకపోలేదు. దానికి తోడు పాఠశాలలు దూరంగా ఉన్న పలు కేంద్రాల లో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం నేరుగా ఇంటికి పంపిస్తున్నారనే విషయం కూడా వినిపిస్తోంది. ఇవి కొన్ని కేంద్రాలు కానీ వేరేపల్లి సెక్టార్ లోని వీరేపల్లి లో రెండు ,చాగళ్ల లోని గేటు అవతల ఉన్న ఇందిరానగర్ కాలనీ లోని ఒక కేంద్రం, చాకిచర్ల ,రామాయపట్నం లోని పలు కేంద్రాల లో అంగన్వాడీ కేంద్రాలు నామ మాత్రం గా నిర్వహిస్తున్నారు. అది అలా ఉంటే కరేడు సెక్టార్ లోని ఎక్కువ శాతం పాఠశాలలు తలుపులు మాత్రం తెరచి సొంత పనులకు వెళ్లిపోతున్నారు. మండల కేంద్రమైన ఉలవపాడు సెక్టార్ పరిధిలో ఉన్న ఒకటి రెండు అంగన్వాడీ కేంద్రాలు మినహాయించి మిగతా ఏ ఒక్క అంగన్వాడీ కేంద్రంలో కూడా అంగన్వాడీ నిర్వహణ పారదర్శకంగా లేదు. ఎక్కువ శాతం పాఠశాల లో విద్యార్థుల నమోదు కి దినసరి హాజరు కి చాలా వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. చాలా మంది తల్లిదండ్రులు తమ బిడ్డలను అంగన్వాడీ లకు పంపించడాని కి ఆ సక్తి కూడా చూపడం లేదు. ఒక్క కార్యకర్త కూడా బిడ్డలకు అక్షరం ముక్క కూడా నేర్పించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ల లో పిల్లలకు ఆట పాటల తో విద్య నేర్పించాలని వారి వయసుకు తగ్గట్టుగా బొమ్మల తో పాఠ్యపుస్తకాలు అందించినప్పటి కి వాటి ఊసు అటు విద్యార్థులు వద్ద కానీ టీచర్ ల దగ్గర కానీ కనపడటం లేదు. ఇలా అస్తవ్యస్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలను కట్టడి చేయవలిసిన మూడు సెక్టార్ ల కు చెందిన సూపర్ వైజర్లు కార్యకర్తలను సమన్వయం చేసి వారిని పలు సూచనలు సలహా ఇవ్వకుండా వారి ప్రలోభాలకు దాసోహం కావడంతో వీరి మాటలను లెక్క కూడా చేయడం లేదు. కనీసం వారి అనుమతి లేకుండానే పాఠశాల లు తెరిసి వారి సొంత పనులకు వెళ్లిపోతున్నారు. అంటే మండల కేంద్రంలో సిడిపిఓ స్థాయి అధికారి ఉండి కూడా ప్రయోజనం లేదనే గుస గుసలు వినిపిస్తున్నాయి.

దళితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ఎస్.సి కమిషన్ సభ్యులు కె. బసవ రావు

విశాలాంధ్ర - కావలి : ఎస్.సి., దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నవరత్నాల కార్యక్రమం ద్వారా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్.సి కమిషన్ సభ్యులు కె. బసవ రావు అన్నారు. మంగళవారం కావలి పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్.సి. కమీషన్ సభ్యులు బసవ రావు మాట్లాడుతూ కొండాపురం మండలం, మర్రిగుంట గ్రామంలో ఎస్.సి కులానికి చెందిన ఇండ్ల చిన అంకయ్య కు సంబంధించిన భూ సమస్య పై రావడం జరిగిందని అన్నారు. దళితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి అమలు చేస్తున్నదన్నారు. దళితులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్.సి ల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత హెూం శాఖ మంత్రిగా దళిత మహిళను నియమించడం జరిగిందన్నారు. దళితులకు చెందాల్సిన పథకాలు అందేలా అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు.

రోడ్డు ప్రమాదం లో సీపీఐ గ్రామ సభ్యుడు మృతి

విశాలాంధ్ర- మర్రిపాడు: మర్రిపాడు మండల కేంద్రం లోని సెంటర్ నెల్లూరు ముంబై జాతీయ రహదారి పై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సీపీఐ ఇర్లపాడు గ్రామ శాఖ సభ్యులు గుర్రం వెంకటేశ్వర్లు జాతీయ రహదారి రోడ్డు దాటు తుండగా నెల్లూరు నుండి సిమెంటు లోడుతో కడప వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చిఢీ కొట్టడం తో లారీ క్రింద తలపడి నుజ్జు నుజ్జు అయ్యి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై రాజేష్, పోలీస్ సిబ్బంది తో అక్కడికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతి చెందిన వ్యక్తి ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించడం జరిగింది.కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న సిపిఐ రైతు సంఘం అధ్యక్షులు గంగినేని నారాయణ,ఇర్లపాడు గ్రామ శాఖ సభ్యులు పాపయ్య, పుల్లయ్య గుర్రం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు. జాతీయ రహదారి పై పోయే వాహనాల డ్రైవర్లు విపరీతమైన స్పీడు తో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయని ముఖ్యంగా బొగ్గు, సిమెంట్ లారీలు ఇష్టా రీతిలో వేగంగా వెళ్తున్నాయని, ప్రమాదాలు మళ్ళీ చోటుచేసుకోకుండా ఇటువంటి వాహనదారులపై గట్టి చర్యలు తీసుకోవాలని సీపీఐ రైతు సంఘం అధ్యక్షులు గంగినేని నారాయణ సంబంధిత అధికారులను కోరారు.

అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం :ఎమ్మెల్యే

విశాలాంధ్ర- ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ప్రజలకు సేవ చేస్తుం దని తన శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగనేనిపల్లి కృష్ణారెడ్డి పల్లి కొత్తపల్లి లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భం గా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలి పారు. సంక్షేమ పథకాలు రాకపోతే సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం లక్షలాది కోట్లు వెచ్చిస్తున్నారని ఆయన పేర్కొన్నారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమన్నారు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరో మారు జగనన్నను రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో రోడ్లు పట్టా పాసుపుస్తకాలు భూ సమస్యలపై ఫిర్యాదులు రాగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మొదట సొసైటీ అధ్యక్షులు మూలే వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మేకపాటికి స్వాగతం పలికారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బిజ్జంపల్లి బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మూలే పద్మజా రెడ్డి తహశీల్దార్ సానా శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో పి ఐజాక్, ప్రవీణ్, ఎంఈఓ షేక్ మస్తాన్ వలి, ఎంపిటిసిలు సర్పం శాఖల అధికారులు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీ వర్క్ షాప్ లో మంత్రి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ ఇఫ్కో ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన నానో టెక్నాలజీ పై ఏర్పాటు చేసిన వర్క్ షాప్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య , వ్యవసాయ శాఖ కమీషనర్ హరికిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యులు విజయ సాయి రెడ్డిని కలిసిన పేర్నాటి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: విజయవాడ లోని రాజ్యసభ సభ్యులు వేణుం బాక విజయ సాయి రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వ కంగా కలిసి, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు సంబం ధించి సుదీర్ఘంగా వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి చర్చించారు.

జగన్ పాలన తో ప్రజలు విసిగిపోతున్నారు: బొల్లినేని

విశాలాంధ్ర- కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో టీడీపీ ఆఫీస్ లో ఉదయగిరి నియోజ క వర్గం టీడీపీ ఇంచార్జ్ బొల్లినేని వెంకట రామా రావు పత్రిక సమావేశంలో మాట్లాడుతూ ఎప్పుడూ రాష్ట్రంలో ఎన్నికలు వస్తాయా అనిప్రజలు ఎదురు చూస్తు న్నారన్నారు. జగన్ పాలనతో ప్రజలు విసిగిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ ఈ పాలనలో అన్ని వర్గాల ప్రజలు జగన్ రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చి మోసపోయారన్నారు. ఇసుక, మద్యం, మాఫియా, భూదందాల కోసమే ఉన్నామన్న రీతిలో పాలకులు వ్యవరిస్తున్నారన్నారు. ఈ రోజు హాస్టల్ లో పిల్లలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. చదివించే వారు లేరు, దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. డ్వాక్రా మహిళలకు భరోసా లేదు, రైతులకు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు ఒక్క సారి గెలిపిస్తే రాష్ట్రానికి "ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి "అని ఆయన అన్నారు. అన్ని వర్గాల వారు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని ఎప్పుడూ జగన్ ని ఇంటికి పంపిండ్దామని ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీమల తాతయ్య,చంద్రమౌళి,జయరామిరెడ్డి, వేంకటాద్రి నాయుడు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలి:హెచ్ఎం

విశాలాంధ్ర- అనుమసముద్రం పేట: విద్యార్థులు గ్రంథాలయా లకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసు కోవాలని త ద్వారా మంచి భవిష్యత్తు పొంద వచ్చని ఏఎస్పేట హెచ్ఎం అబ్దుల్ హమీద్ తెలిపారు. 55వ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఏఎస్పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు వారి పుట్టినరోజు సంద ర్భంగా ఒక పుస్తకాన్ని గ్రంథాలయానికి బహుకరించే అలవాటు చేసు కోవా లని సూచించారు. విద్యార్థి మోటివేటర్ నారాయణరావు మాట్లా డుతూ సుధా నారాయణమూర్తి చిన్ననాటి నుంచి గ్రంథాల యానికి వెళ్లే అలవాటు చేసుకున్నారని పదివేల గ్రంథాలయాల స్థాపనకు తోడ్పడ్డారని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్పోకెన్ ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను బహూకరించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చలపతిరావు, ఉపాధ్యాయులు హరికృష్ణ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానంలో ఇంటూరి

విశాలాంధ్ర- ఉలవపాడు: ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఓరుగంటమ్మ ఆలయం సమీపంలో గత 25 రోజులుగా అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. మంగళవారం 26 రోజు కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. ముందుగా అయ్యప్ప స్వామికి పూజలు చేసిన అనంతరం నాగేశ్వరరావు అన్నదానం ప్రారంభించి స్వయంగా భక్తులకు వడ్డించారు. మాలధారులకు సంబంధించిన కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాదు, పార్టీ నాయకులు బంగారు రెడ్డి, పోలుబోయిన శ్రీనివాసులు, హరిబాబు, రామదాసు, బాలచంద్రరావు, వెంకటరమణ, శ్రీధర్, వెంకట్రావు, శ్రీను, బాలమురళి, కత్తి కొండయ్య, కత్తి మహేష్, కత్తి శ్రీహరి, వెంకట్రావు, రాచగర్ల శివ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేదగిరి లో స్వాతి నక్షత్ర విశేష పూజలు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో వేంచేసిన వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా మూలవర్లకు ఉదయం పంచామృత అభిషేకం, సుదర్శన నారసింహ యాగం, తిరుప్పావడ సేవలను వేద పండితులు మంత్రోచ్చారణ ల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు. పంచామృత అభిషేకంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, కార్య నిర్వహణాధికారి వి. గిరికృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు అల్లూరు దినేష్ కుమార్, నెట్టం రఘు రామయ్య, పామూరు మల్లికార్జున రెడ్డి, రాపురు అంజయ్య, మడపాకుల జయమ్మ, సుంకర మస్తానమ్మ, వినుకోటి ప్రసన్న లక్ష్మి , ఇండ్ల లక్ష్మమ్మ , అర్చక సిబ్బంది దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ

విశాలాంధ్ర - కావలి : సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని శివరామ సుబ్బ య్య కాలనీలో 50 మంది నిరు పేదలకు భీమరాజు చంద్రశేఖర రావు జ్ఞాప కార్థంగా బెంగుళూరులో నివాసం ఉంటున్న వారి సతీమణి భీమరాజు అన్నపూర్ణ, వారి కుమారులు, కుమార్తెలు, వారి కుటుంబ సభ్యుల తరుపున మంగళవారం భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ తమ సేవా సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు. వృత్తిరీత్యా బెంగుళూరులో నివాసం ఉంటున్నా కూడా వారి స్వగ్రామమైన కావలిలోని పేదలకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు. చంద్రశేఖర రావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

ఎంఆర్‌పీఎస్ నెల్లూరు అధ్యక్షుడిగా అనిల్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లా స్థానిక బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేక రుల సమా వేశంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీ ఎస్ నెల్లూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా కొండా అనిల్ కుమార్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా కొండా అనిల్ కుమార్ నియామకాన్ని అధికారికంగా మీడియా సమావేశంలో ప్రకటించారు. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగివున్న నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా కొనసా గుతున్న కొండా.అనిల్ కుమార్ సేవలను నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటాలకు, అరుంధతీయుల (మాదిగ) హక్కులను కాపాడేందుకు ఉప యోగపడే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పరిసిపోగు శ్రీనివాసులు ఇదే అంబేద్కర్ భవన్లో ఇందిరాగాంధీ జయంతి రోజున నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నెల్లూరు అధ్యక్షుడిగా కొండా అనిల్ కుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. పరిసిపోగు శ్రీనివాసులు ఆదేశాలను,కొండా.అనిల్ కుమార్ సేవలను గౌరవిస్తూ ఈరోజు పత్రిక విలేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటిస్తున్నామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదురు.రత్నం తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి.రమణ రావు, సలహాదారు పవన్ కుమార్,ప్రధాన కార్యదర్శి పర్రి.భాస్కర్ పాల్గొన్నారు.

వైకుంఠపురం బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి

- అన్నపుగుంటలో దిగి నిరసన

విశాలాంధ్ర - కావలి : పేదలు నివసించే వైకుంఠపురం పట్ల పాలకులు, అధికారులు చిన్నచూపు, నిర్లక్ష్య ధోరణి, మొద్దు నిద్ర నుంచి మేలుకొల్పేందుకు జనసేన జలదీక్ష చేస్తున్నదని జనసేన నాయకుడు సిద్దు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం అనపగుంటలో దిగి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వైకుంఠపురం బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వైకుంఠపురం, పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ, నార్త్ జనతాపేట వాసులు రైల్వే ట్రాక్ పై నడుస్తూ పడుతున్న బాధలు మీకు కానరావడం లేదా? అని ప్రశ్నించారు. ట్రాక్ దాటుతూ రైళ్ళు గుద్దుకుని వృద్ధులు, దివ్యాంగులు గత పది సంవత్సరాలుగా 20 మందికి పైగా చనిపోయారన్నారు. ఇంకా ఎంతమంది చనిపోతే మీలో చలనం వస్తుందని ప్రశ్నిస్తున్నానన్నారు. రైల్వే ట్రాక్ దాటలేక పట్టణంలోకి వచ్చేందుకు ఆటోల బాడుగలు కట్టలేక పేదలు అల్లాడుతున్నారన్నారు. నెలకు ఒక్కొక్క ఇంటికి సరాసరి 2వేల పైనే భారం పడుతుందిని, ఈ భారం ఎవరు భరించాలి? అని ప్రశ్నించారు. మురికి నీరు పోయే తూములో బాట చూపించి ఏదో ఘనకార్యం చేసినట్లు చంకలు గుద్దుకుంటున్నారన్నారు. ఆ మురుగు నీళ్ళల్లో విద్యార్థులు, మహిళలు పడే బాధలు మీకు పట్టడం లేదా? అని ప్రశ్నించారు. అనపగుంటను పార్కుగా చేస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమయ్యింది? అని ప్రశ్నించారు. పిచ్చి మొక్కలు, నాచు, వ్యర్థాలతో అనపగుంట అధ్వానంగా ఉంటే మున్సిపల్ అధికారులు ఏమి చేశారన్నారు. వర్షాలు కురువక ముందే అనపగుంటలో పూడిక ఎందుకు తీయలేదన్నారు. ఈ రోజు అనపగుంట సర్వ రోగాల ఉత్పత్తి కేంద్రంగా మారిందని, హానికర దోమలన్నీ ఇక్కడే పెరుగుతున్నాయన్నారు. చేపలు, మాంసం వ్యర్థాలతో ఇటుగా వెళ్ళే వారికి కుళ్ళు కంపు కొడుతోందన్నారు. ఈ గుంటలో నుంచి పారే నీళ్ళల్లో అందరూ నడిచి పోయే ఖర్మ దాపురించిందన్నారు. రైల్వే అధికారులు వంతెన కింద పీడబ్ల్యూ ఐ యూనిట్, ఓహెచ్ఇ షెడ్డు నిర్మాణం చేసుకుని బ్రిడ్జి కింద రాకపోకలు నిషేదిస్తున్నారన్నారు. తూముకు ఎదురుగా బాట వేసుకోవాలని రైల్వే అధికారులు చెబుతున్నారన్నారు. ఈ బాట కూడా వేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితి మన మున్సిపాలిటీకి ఉందా? అని ప్రశ్నించారు. ఈ సమస్యను

చూసేందుకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి పాత బిల్డింగులు ఎక్కడన్నా పడేస్తే ఆ వేస్ట్ మెటీరియల్ తోలించి బాట వేస్తా అని చెప్పడం సిగ్గుచేటు గా అనిపించలేదా? అని విమర్శించారు. ఎక్కడైనా ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి ఎస్టిమేట్ వేయించి యుద్ధప్రాతిపదికన రోడ్డు వేస్తారు కాని, అసలు పాత బిల్డింగుల మెటీరియల్ తోలడం ఏమిటి? అని ప్రశ్నించారు. కావలి పట్టణంలో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కి తెలియకుండా చీమకూడా దూరడానికి లేదు. అసలు మున్సిపాలిటీలో ఏమి జరుగుతుందో తెలుసా, తెలియనట్లు నటిస్తున్నారా? అన్నారు. వైకుంఠపురం వాసులు మిమ్మల్ని నమ్మి రెండు సార్లు భారీ మెజార్టీ ఓట్లు వేశారు. కానీ వారికి మీరు ఏమి న్యాయం చేస్తున్నారన్నారు. ఒక్క రోడన్నా బాగుందా? కాలువలు ఉన్నాయా? పాపం ఇక్కడ బాగా పనిచేసే మాజీ కౌన్సిలర్లు మాల్యాద్రి, పుల్లయ్య ఉన్నారు. రోడ్లు, కాలువలు కావాలని వారు బతిమాలుతున్నా ఎందుకు కనికరించం లేదు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వెంటనే ఎన్నికల ముందు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు అయిన బ్రిడ్జి నిర్మాణం, అనపగుంటకు శాశ్వత పరిష్కారం, వైకుంఠపురంలో సదుపాయాలు కల్పించాలని జనసేన తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కావలి రూరల్ అధ్యక్షులు తిరుపతి స్వామి, పసుపులేటి సురేష్, తోట సాయి, మనోజ్ కుమార్, జోషి, రమేష్, విజయ్, విష్ణు, చక్రి, జనసైనికులు పాల్గొన్నారు.